సాక్షి అనకాపల్లి

శుక్రవారం । 10 । జనవరి । 2025



20 కోచ్‌లతో వందేభారత్

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖ-సికింద్రాబాద్-విశాఖ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను 20 కోచ్‌లతో నడపనున్నారు.



నితీష్‌కు ఘన స్వాగతం

విశాఖస్పోర్ట్స్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో రాణించిన తెలుగు తేజం నితీష్ కుమార్ రెడ్డికి విశాఖలో ఘనస్వాగతం లభించింది.



హెచ్‌ఎంపీవీపై అప్రమత్తం

మహారాణిపేట: హెచ్‌ఎంపీవీపై ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కేజీహెచ్‌లో 20 పడకలతో ఐసోలేషన్ వార్డు సిద్ధం చేశారు.

అంతులేని విషాదం

తిరుపతి తొక్కిసలాట ఘటనలో నలుగురు ఉమ్మడి విశాఖవాసుల దుర్మరణం

ప్రభుత్వ నిర్లక్ష్యంపై మృతుల కుటుంబ సభ్యుల ఆగ్రహం



ఇందిరానగర్‌లో ఫొటో పట్టుకుని రోదిస్తున్న శాంతి తల్లి, బంధువు



జీవీఎంసీ 55వ వార్డు, గాంధీనగర్‌కు చెందిన కండిపిల్లి శాంతి, ఆమె భర్త వెంకటేష్, కుమారుడు మహేంద్ర వరప్రసాద్ గోవింద మాలధారణ దీక్ష చేపట్టి, దీక్ష విరమణ కోసం తిరుపతి వెళ్లారు. ఈమె కూడా అక్కడ జరిగిన తొక్కిసలాటలో మృతి చెందారు. కుమారుడు వరప్రసాద్ రోదనలు కలచివేస్తున్నాయి. శాంతి మరణంతో గాంధీనగర్‌లో విషాదచాయలు అలుముకున్నాయి. శాంతి అందరితో మంచిగా ఉండేవారని స్థానికులు గుర్తు చేసుకున్నారు. శాంతి తల్లి కిల్లాడి అప్పల నరసమ్మ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే తన కూతురు మరణించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఒక్కొక్క కుటుంబానిది ఒక్కో కథ.. అంతులేని వ్యథ.. భగవంతుడి దర్శనంతో తమ జీవితాలు ధన్యమవుతాయని భావించిన వారి విధిని విధాత మరోలా రాశాడు. దైవ దర్శనానికి వెళ్లిన నలుగురు భక్తులు ఊహించని ప్రమాదంలో విగతజీవులుగా మారడంతో ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటలో మృతి చెందిన ఆరుగురిలో నలుగురు ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన వారుండటం దిగ్భ్రాంతికి గురిచేసింది. కుటుంబ సభ్యుల మృతితో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుంటే.. ఆయా కాలనీల ప్రజల హృదయాలు బరువెక్కాయి. ఈ హృదయ విదారక సంఘటన భక్తుల భద్రతా ఏర్పాట్లపై అనేక ప్రశ్నలను లేవనెత్తింది. ఈ దుర్ఘటన ప్రభుత్వం, టీటీడీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

– సీతంపేట/కంచరపాలెం/మద్దిలపాలెం/నర్సీపట్నం





భార్య మృతదేహం వద్ద విలపిస్తున్న భర్త లక్ష్మారెడ్డి

మద్దిలపాలేనికి చెందిన గుడ్ల రజనీ(47), **ఆమె భర్త లక్ష్మారెడ్డి వైకుంఠ ద్వార దర్శనం కోసం రెండు రోజుల కిందట తిరుపతి వెళ్లారు. టోకెన్ల జారీ సమయంలో జరిగిన ఘటనలో రజనీ** మృతి **చెందారు. లక్ష్మారెడ్డి ఆటో** డ్రైవ**ర్‌గా జీవనం సాగిస్తున్నా**రు. **వారి కుమారుడు హర్షవర్ధన్** రెడ్డి **ఎంఎస్ చదువు కోసం ఆ**మెరికాలో ఉన్నారు. కుమారుడి భవిష్యత్తు కోసం రజనీ నిత్యం వేంకటేశ్వర స్వామి, సాయిబాబాకు పూజలు చేసేవారని బంధువులు తెలిపారు. రజనీ పరమ భక్తురాలని, ఆమె ఇల్లు దేవాలయంలా ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఆధ్యాత్మిక యాత్రకు వెళ్లి అనంత లోకాలకు వెళ్లిపోయావా అంటూ రజనీ తోటి కోడళ్లు బోరు విలపించారు. కుమారుడి భవిష్యత్‌ను చూడకుండా కన్నుమూసిందని కన్నీరు పెట్టుకుంటున్నారు. తిరుపతి నుంచి వారు పంపిన ఫొటోలు మొబైల్‌లో చూస్తూ ఆవేదన చెందారు.

లావణ్య చాలా యాక్టివ్



నేను లావణ్య ఇంటి పక్కనే ఉంటున్నాను. ఆమెతో నాకు చాలా ఏళ్లుగా పరిచయం ఉంది. ఆమె చాలా యాక్టివ్. సరదాగా, అందరితో కలివిడిగా ఉండేది. జయవందన డ్వాక్రా గ్రూపునకు ఆమె అధ్యక్షురాలు. ఎప్పుడూ వైకుంఠ ద్వార దర్శనం చేసుకోలేదు, ఒకసారి వెళ్లాలని ఉందని చెప్పేది. తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఆమె చనిపోయిందని మంగళవారం అర్ధరాత్రి తెలిసింది. చాలా సేపు నేను ఆ విషయాన్ని నమ్మలేకపోయాను. ఆమెకు ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తల్లి లేని బాధను ఆ పిల్లలు ఎలా తట్టుకుంటారో అని ఆలోచిస్తేనే ఏడుపు వస్తోంది. ఆ వెంకటేశ్వరస్వామి ఆ కుటుంబానికి ధైర్యాన్ని ప్రసాదించాలి.

– పప్పీ,
లావణ్య స్నేహితురాలు, వెంకటేశ్వర కాలనీ



నర్సీపట్నంలోని పెద్దబొడ్డేపల్లి నివాసి బొడ్డేటి నాయుడు బాబు తీర్థయాత్రకు వెళ్లి.. తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడం ఆ కుటుంబంలో రోదనలు మిన్నంటాయి. ఈ నెల 6న నాయుడు బాబు, అతని భార్య మణికుమారి, నర్సీపట్నం మండలం చెట్టుపల్లికి చెందిన కరణం సత్యనారాయణ, అతని భార్య సంతోషి కలిసి వేంకటేశ్వర స్వామి వైకుంఠ దర్శనానికి వెళ్లారు. ఈ క్రమంలో జరిగిన తొక్కిసలాటలో నాయుడుబాబు మరణించాడు. ప్రమాదం నుంచి మణికుమారిని పోలీసులు రక్షించారు.



విషాదంలో నాయుడుబాబు బంధువులు

జీవీఎంసీ 43వ వార్డు, వెంకటేశ్వర కాలనీకి చెందిన సూరిశెట్టి లావణ్య తన ఆడపడుచు, మరో ముగ్గురు మహిళలతో కలిసి ఈ నెల 5న వైకుంఠ ద్వార దర్శనానికి తిరుపతి వెళ్లారు. టోకెన్ల కోసం క్యూలో ఉండగా జరిగిన తొక్కిసలాటలో ఆమె మృతి చెందారు. భర్త సతీష్ సెవెన్‌హిల్స్ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తల్లి మరణవార్తను పిల్లలకు ఎలా చెప్పాలో తెలియక సతీష్ తీవ్ర వేదనకు గురవుతున్నారు. లావణ్య కాలనీలో అందరితో కలివిడిగా ఉండేవారని, జయవందన డ్వాక్రా గ్రూపునకు అధ్యక్షురాలని స్థానికులు గుర్తు చేసుకున్నారు.



తిరుపతిలో లావణ్య చివరిసారి తీసుకున్న సెల్ఫీ



లావణ్య భర్త సతీష్‌ను ఓదార్చుతున్న కుటుంబ సభ్యులు, బంధువులు

మంచి స్నేహితులం



నేను, లావణ్య, పప్పీ ముగ్గురం మంచి స్నేహితులం. లావణ్య చనిపోయిందని తెలిశాక నాకు కాళ్లు చేతులు ఆడలేదు. అందరికీ సహాయం చేస్తుంది. ప్రతి నెలా డ్వాక్రా టీఎల్‌ఎఫ్ మీటింగ్‌లో కలుస్తుంటాం. కష్ట సుఖాలు మాట్లాడుకునేవాళ్లం. ఈ నెల 26న జరిగిన మీటింగ్‌లో కలిశాం. అప్పుడే తిరుపతి వైకుంఠ ద్వార దర్శనానికి వెళ్తున్నామని చెప్పింది. దేవుడి సన్నిధిలో ఇలా జరగడం చాలా బాధ అనిపించింది. నిన్నటి వరకు మాతో కలిసి ఉన్న లావణ్య ఇప్పుడు లేదంటే మనసుకు కష్టంగా ఉంది.

– సీహెచ్ రమ,
స్నేహితురాలు, వెంకటేశ్వర కాలనీ

న్యూస్‌రీల్

ప్రభుత్వం, టీటీడీ నిర్లక్ష్యంతోనే..



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి

దేవరాపల్లి: తిరుమల శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం టోకెన్ల జారీలో జరిగిన తొక్కిసలాటకు ప్రభుత్వం, టీటీడీ పాలక మండలి సభ్యులు, అధికారులు నైతిక బాధ్యత వహించాలని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు డిమాండ్ చేశారు. తారువలో గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు మరణించడం హృదయాన్ని కలిచి వేసిందని విచారం వ్యక్తం చేశారు. ముమ్మాటికీ నిర్లక్ష్యమే తొక్కిసలాటకు కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనకు పూర్తి బాధ్యత వహించి ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలతోపాటు క్షతగాత్రులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో కూడా చంద్రబాబు ప్రచార ఆర్భాటం కారణంగా గోదావరి పుష్కరాల్లో తొక్కిసలాట జరిగి 29 మంది భక్తులు ప్రాణాలు కోల్పోయారన్నారు. గత ఐదేళ్లలో ఇలాంటి ఘటనలు ఎక్కడా జరగలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేసిన చంద్రబాబు అండ్ కో ఈ ఘటనకు ఏ సమాధానం చెబుతారని, ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు.

పాడిని ప్రోత్సహించేందుకే ప్రదర్శనలు

- పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి ప్రసాద్



బహుమతులు అందజేస్తున్న ప్రసాద్, వైద్యులు

మాకవరపాలెం: పాడి రైతులను మరింత ప్రోత్సహించేందుకే లేగదూడల ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్టు పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి ప్రసాద్ తెలిపారు. లచ్చన్నపాలెంలో గురువారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో పాడి రైతులు 43 లేగదూడలను ఉంచారు. వీటిని పరిశీలించిన పశుసంవర్ధకశాఖ అధికారులు ఆరోగ్యంగా ఉన్న దూడలను ఎంపిక చేసి రైతులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహించేందుకే ఏటా లేగదూడల ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. పాల దిగుబడులు పెంచడంతో పాటు పశువులకు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వెనుకబడ్డ విద్యార్థులపై దృష్టి పెట్టండి



విద్యార్థులకు సూచనలిస్తున్న ఆర్జేడీ విజయభాస్కర్

మాకవరపాలెం: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్ ఆదేశించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు నిర్వహిస్తున్న అదనపు తరగతులను ఆయన గురువారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పరీక్షలపై పలు సూచనలిచ్చారు. త్వరలో జరిగే పది పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా తమ పిల్లలు టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కుపోకుండా బాగా చదివేలా చూడాలన్నారు.

విశాఖ ఉక్కు ఊసెత్తలేదేం మోదీజీ..

దేవరాపల్లి: విశాఖ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని ప్రస్తావించకపోవడం అత్యంత దారుణమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. దేవరాపల్లిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రకటన చేస్తారని ప్రజలంతా ఎంతో ఆశతో ఎదురు చూశారని, కనీసం ఆ ఊసెత్తక పోవడం ఈ ప్రాంత ప్రజలను మోసగించడమేనని ఆయన ధ్వజమెత్తారు. సీపీఎం కార్యకర్తలను పోలీసులు బలవంతంగా గృహ నిర్బంధం, అక్రమ అరెస్టులు చేయడం కూటమి ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలకు నిదర్శనమన్నారు. తాము అక్రమ అరెస్టులు, గృహ నిర్బంధాలు చేయబోమని గతంలో చెప్పిన మంత్రి లోకేష్ ఇప్పుడు ఏమంటారని ప్రశ్నించారు. చోడవరం, మాడుగుల, సబ్బవరం, పరవాడ, కోటవురట్ల మండలాల్లో సీపీఎం మహిళా కార్యకర్తలను అరెస్టు చేయడం దారుణమన్నారు.



ముక్కోటి దేవతలు ఒక్కటయ్యే వేళ..

ఉపమాకలో ఉత్తరద్వార దర్శనం నేడు

వేలాదిగా దర్శించుకోనున్న భక్తులు



క్యూలో వచ్చే భక్తుల కోసం ఏర్పాటు చేసిన పందిళ్లు

నక్కపల్లి: ప్రాచీన పుణ్యక్షేత్రం ఉపమాకలో శుక్రవారం వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. మూడు కోట్ల దేవతలకు రాక్షస బాధల నుంచి విముక్తి కల్పించిన రోజు కాబట్టి ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశి అని కూడా అంటారు. ఉపమాక క్షేత్రంలో గరుడాద్రి పర్వతంపై శ్రీమన్నారాయణుడు దశావతారాల్లో పదో అవతారమైన కల్కి అవతారంగా స్వయంవ్యక్తమై వెలిశారు. తిరుపతి, సింహాచలం, అన్నవరం, భద్రాచలం తదితర వైష్ణవ క్షేత్రాల్లో ఒక్క ముక్కోటి ఏకాదశినాడే ఉత్తరద్వార దర్శనం కల్పిస్తే ఉపమాకలో భక్తులకు అనునిత్యం ఈ భాగ్యం లభిస్తుంది. శుక్రవారం వేకువజామున 3 గంటలకు తొలి అభిషేకం జరుగుతుంది. అనంతరం ఉదయం నుంచే భక్తులకు దర్శనాలు కల్పిస్తారు. సాయంత్రం స్వామివారిని రంగనాథుడిగా అలంకరిస్తారు. శ్రీదేవి, భూదేవి కాళ్లు వత్తుతున్నట్లుగా అలంకరించి పుణ్యకోటి వాహనంపై ఊరేగిస్తారు. ఎక్కడా లేని విధంగా ఉపమాక క్షేత్రంలో ఎనిమిది వాహనాల్లో తిరువీధి సేవలు నిర్వహిస్తారు. రాజాధిరాజ వాహనంలో గోదాదేవి అమ్మవారిని, పొన్న వాహనంలో రుక్మిణి సహిత వేణుగోపాలస్వామిని, ఆంజనేయ వాహనంపై సీతారాములను, పల్లకిపై బాలరాముడిని, వీరితోపాటు ఇతర వాహనాలపై తాండవ కృష్ణుడు, ప్రాకార పెరుమాళ్లను ఉంచి తిరువీధి సేవలు జరిపిస్తామని ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ తెలిపారు.

ఘనంగా ఏర్పాట్లు చేసిన టీటీడీ

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం వారు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ గోపురాలను సర్వాంగ సుందరంగా పూలమాలలతో అలంకరించారు. బేడా మండపం, మహాద్వారం, ధ్వజస్తంభాల వద్ద పూలాలంకరణ చేసి పందిళ్లు, షామియానాలు, బారికేడ్లు ఏర్పాటు చేశారు. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఉత్తరాంధ్ర నుంచి కూడా స్వామివారిని ఉత్తర ద్వారం గుండా దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులు తరలిరానుండడంతో విస్తృత ఏర్పాట్లు చేశారు.

నేడు వడ్డాదిలో గిరి ప్రదక్షిణ



వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆలయం

బుచ్చెయ్యపేట: వడ్డాది వేంకటేశ్వరస్వామి వెలసిన గిరిజాంబ కొండ చుట్టూ వైకుంఠ ఏకాదశి సందర్భంగా శుక్రవారం గిరి ప్రదక్షిణ నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేశారు. ఉదయం 8 గంటలకు కొండ దిగువన ఉన్న తొలి మెట్టు నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభమై గౌరీపట్నం రోడ్డులో మార్కెట్ యార్డు స్థలం ముందు నుంచి కోవెల అప్పనదొర జిల్లా పరిషత్ హైస్కూల్, కాలేజీ రోడ్డు నుంచి భీమునిపట్నం, నర్సీపట్నం రోడ్డును ఆనుకుని ఉన్న వేంకటేశ్వరస్వామి ఆర్చ్ మీదుగా ఐదు కిలోమీటర్ల మేర సాగనుంది. తిరుపతి నుంచి తీసుకొచ్చిన వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహంతోపాటు కోలాటాలు, భజనలు, భక్తి గీతాల ఆలాపనల మధ్యన గిరి ప్రదక్షిణ చేయడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు, శ్రీవారి గిరి ప్రదక్షిణ కమిటీ సభ్యుడు రమేష్ తెలిపారు.

కేజీబీవీలో అడుగడుగునా అధికారుల అలక్ష్యం

- 37కు చేరిన బాధితుల సంఖ్య



వేములపూడి పీహెచ్‌సీలో విద్యార్థినిని పరామర్శిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

నర్సీపట్నం : వేములపూడి కేజీబీవీ వసతిగృహంలో అడుగడుగునా అధికారుల అలక్ష్యం కనపడుతుంది. సోమవారమే కొద్ది మంది విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలు బయటపడగా, అప్పుడే విద్యార్థినులు అక్కడ ఉన్న సిబ్బందికి తమ పరిస్థితి గురించి చెప్పారు. కాస్త విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని సిబ్బంది విద్యార్థినులకు నచ్చజెప్పారు. సోమవారం నాటి ఆహారం కలుషితం కావడం వల్లే ఈ పరిస్థితి ఎదురైనట్టు తెలుస్తుంది. అప్పుడే సిబ్బంది మేలుకుంటే విద్యార్థుల పరిస్థితి ఇంత వరకు వచ్చేది కాదని పలువురు చెబుతున్నారు. విద్యార్థుల అస్వస్థతకు ఎవరు బాధ్యులో తేలడం లేదు. తూతూ మంత్రం తనిఖీలు చేసి వెళ్లిపోతున్నారు. హాస్టల్ నిర్వహణ అంతా సవ్యంగానే ఉందని సూపరింటెండెంట్ శాంతి సరిపుచ్చుకుంటున్నారు. మరి విద్యార్థినులు అనారోగ్యం బారిన ఎందుకు పడ్డారో ప్రశ్నార్థకంగా మారింది.

అధికారుల పరిశీలన...

వేములపూడి కస్తూర్బా బాలికల వసతిగృహాన్ని గురువారం విద్య, ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి రవికుమార్ విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వంటశాల, వాటర్‌ప్లాంట్, మరుగుదొడ్లను తనిఖీ చేశారు. మంచినీటి నమూనాలను తీసి పరీక్షల నిమిత్తం పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయ్ భాస్కర్, జిల్లా విద్యాశాఖాధికారి అప్పారావునాయుడు వేములపూడి, నర్సీపట్నం ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్న విద్యార్థినులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటామన్నారు.

గురువారం మరో 19 మంది...

కేజీబీవీలో గురువారం నాటికి అస్వస్థతకు గురైన విద్యార్థుల సంఖ్య 37కు చేరింది. సోమవారం నాడు ఐదుగురు విద్యార్థులు అస్వస్థతకు గురవ్వగా, మంగళవారం నాడు 13 మంది అస్వస్థతకు గురయ్యారు. గురువారం నాడు మరో 19 మంది వాంతులు, విరేచనాలతో ఆస్పత్రి పాలయ్యారు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రిలో ఏడుగురు, వేములపూడి పీహెచ్‌సీలో ఐదుగురు చికిత్స పొందుతున్నారు. మిగిలిన వారికి హాస్టల్‌లోనే ప్రత్యేక శిబిరం ద్వారా డాక్టర్ అనూష చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉంది. మరో 48 గంటల పాటు విద్యార్థులను వైద్యుల పర్యవేక్షణలో ఉంచి వైద్య సేవలు అందించనున్నారు.

లక్కవరం శివార్లలో మహిళ హత్య

- బంగారం కోసమే హతమార్చినట్టు అనుమానం



హత్యకు గురైన నర్సమ్మ



నర్సమ్మ (ఫైల్)

చోడవరం: లక్కవరం శివారులోని చెరకు తోటలో ఒక మహిళ హత్యకు గురైంది. గొంతు కోసి హతమార్చిన దుండగులు ఆమె మెడలో ఉన్న బంగారాన్ని అపహరించుకుపోయారు. లక్కవరం గ్రామానికి చెందిన ఒబలరెడ్డి నర్సమ్మ (50) శివారున మారుతీనగర్ సమీపంలో ఉన్న తన పొలంలోకి గురువారం మధ్యాహ్నం గడ్డి కోసేందుకు వెళ్లింది. సాయంత్రం అవుతున్నా ఆమె తిరిగి రాకపోవడంతో భర్త నర్సింహమూర్తి పరిసర పొలాలు, చెరకు తోటల్లో వెతికి చెరకు తోటలో తన భార్య నర్సమ్మ రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించాడు. లక్కవరం -గవరవరం రోడ్డును ఆనుకొని ఉన్న చెరకు తోటలో ఈ హత్య జరగడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్యకు గురైన మహిళ మెడలో సుమారు 3 తులాల బంగారం పుస్తెల తాడు లేకపోవడంతో బంగారం కోసమే ఎవరో హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. హంతకుడికి ఆమెకు మధ్య పెనుగులాట జరిగినట్టుగా అక్కడ ఉన్న ఆనవాళ్లను బట్టి భావిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ శ్రావణి, సీఐ అప్పలరాజు హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు. నర్సమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు.

సంక్రాంతి సెలవులకని ఇంటికి వెళ్తూ..

- ఆటో నుంచి జారిపడి విద్యార్థిని మృతి
- సోమిదేవపల్లిలో ఘటన



మృతురాలు విద్యార్థిని యోగిత



యోగిత (ఫైల్)

ఎస్.రాయవరం/రోలుగుంట: సంక్రాంతి సెలవులకు స్వగ్రామానికి వెళ్తూ ఆటో నుంచి జారిపడి పదో తరగతి విద్యార్థిని మృతి చెందింది. ఈ ఘటన ఎస్.రాయవరం మండలం సోమిదేవపల్లి సమీపంలో గురువారం చోటు చేసుకుంది. రోలుగుంట మండలం కొండపాలెం గ్రామానికి చెందిన పాము యోగిత(16) ఎస్.రాయవరం మండలం లింగరాజుపాలెం వద్ద మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాలలో చదువుతోంది. శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో పాఠశాల నుంచి తన తల్లి శ్రీదేవి, మరో నలుగురు స్నేహితురాళ్లతో కలిసి వారి స్వగ్రామాలకు బయలు దేరారు. ఈ క్రమంలో అడ్డురోడ్డు నుంచి నర్సీపట్నం రోడ్డు గతుకులుగా ఉండటంతో పెనుగొల్లు నుంచి దార్లపూడి మీదుగా ప్రయాణించారు. సోమిదేవపల్లి సమీపంలో ఆటో మలుపు తిరుగుతుండగా విద్యార్థిని జారిపడి తీవ్రంగా గాయపడింది. ఆమెను అదే ఆటోడ్రైవర్ హుటాహుటిన నక్కపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే మృతి చెందింది. ఎస్.రాయవరం పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తు చేస్తున్న హెచ్‌సీ పవన్ తెలిపారు.

కొండపాలెంలో విషాద ఛాయలు..

రోలుగుంట మండలం కొండపాలెం గ్రామానికి విద్యార్థిని మృతదేహం తీసుకురావడంతో మృతురాలి తల్లిదండ్రులు గోవింద, శ్రీదేవి, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. సెలవులకు ఇంటికొస్తున్న కుమార్తెతో కలిసి సంక్రాంతి పండగ ఎంతో ఆనందంగా చేసుకోవాలని పొంగిపోయారు. అంతలోనే రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో తీవ్ర దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

క్లుప్తంగా

దత్తత గ్రామాల్లో నువ్వు విత్తనాల పంపిణీ



రైతులకు నువ్వు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీ రామారావు

అనకాపల్లి: నువ్వుల్లో సమగ్ర యాజమాన్యం చర్యల ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.రామారావు తెలిపారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో దిబ్బపాలెంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ గ్రామంతో పాటు మరో దత్తత గ్రామం వెంకుపాలెంలో వంద ఎకరాలకు సరిపడా నువ్వు విత్తనాల కిట్లను 160 మంది రైతులకు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ రబీలో నువ్వు పంటతో తక్కువ ఖర్చుతో అధిక నికర ఆదాయం వస్తుందన్నారు. వేరుశనగ, పొద్దుతిరుగుడు, నువ్వులు వంటి పంటల్లో భాస్వర ఎరువులను సింగిల్ సూపర్ ఫాస్ట్ రూపంలో అందించడం ద్వారా నూనెశాతం పెరుగుతుందన్నారు. బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ రెండున్నర కిలోల శారదారకం నువ్వు వితనంతో పాటు రెండు కిలోల ట్రైకోడెర్మా ఒక లీటరు పెండిమితాలిన్ కలుపు మందు, ఒక లీటర్ వేప నూనె, ఒక బస్తా సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ కలిపి రైతులకు కిట్లుగా అందిస్తున్నామన్నారు. సర్పంచ్ పీలా అప్పారావు, గ్రామ అభ్యుదయ రైతులు వీరునాయుడు, శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు గణేష్ పాల్గొన్నారు.

చిల్డ్రన్ స్పెషలిస్టు బదిలీ

సాక్షి, అనకాపల్లి: ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో పనిచేస్తున్న పిల్లల వైద్యుడు డాక్టర్ జె.రవిరాజా కుమార్ కుప్పం ఏరియా ఆస్పత్రికి బదిలీ అయ్యారు. ఈ మేరకు గురువారం వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మాని ఉత్తర్వులు జారీ చేశారు.

అగ్నివీర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు

రంపచోడవరం: అగ్నివీర్ వాయుసేనలో ప్రవేశాల కోసం ఈ నెల 27లోగా దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయశాంతి తెలిపారు. జనవరి 2005, 2008 జూలై 01 మధ్య జన్మించిన గిరిజన అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఏపీఎస్‌బీపీ ఏటీహెచ్‌వీఏవైయూ. సీడీఏసీ.ఐఎన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.



గుత్తులపుట్టు సంతలో కిరాణా దుకాణాలు



గుత్తులపుట్టు సంతలో దుస్తులు కొనుగోలు చేస్తున్న గిరిజనులు

- మన్యంలో కొనుగోలుదారులతో దుకాణాలు కిటకిట
- పండగ సమీపించడంతో ఊపందుకున్న అమ్మకాలు
- వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలతో ఆదాయం
- అవసరమైన సామగ్రి కొనుగోలు చేస్తున్న గిరిజనులు
- కోళ్లు, మేకలకు రికార్డు ధర
- గుత్తులపుట్టు సంతలో రూ.కోటికి పైగా వ్యాపారం

ఏజెన్సీలో వారపు సంతలు కిటకిటలాడుతున్నాయి. సంక్రాంతి పండగ సందర్భంగా కొనుగోళ్లు ఊపందుకున్నాయి. ఇంటిల్లపాది వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. వచ్చిన ఆదాయంతో తమకు అవసరమైన పండగ వస్తువులు కొనుక్కొని తీసుకువెళ్తున్నారు. గతేడాదితో పోలిస్తే ధరలు బాగా పెరిగాయని గిరిజనులు తెలిపారు.

పండగ వరకు సంతలు జరిగే ప్రాంతాలు

శుక్రవారం పాడేరు, అరకు, శనివారం హుకుంపేట, ముంచంగిపుట్టు, ఆదివారం సుంకరమెట్ట, ధారకొండ, మినుములూరు, వంట్లమామిడి, సోమవారం అన్నవరం, పెదబయలు, రూఢకోట.

సంతలకు సంక్రాంతులు



గుత్తులపుట్టు సంతలో మేకలు,గొర్రెల అమ్మకాలు

సాక్షి,పాడేరు: మన్యంలో వారపు సంతలకు సంక్రాంతి శోభ నెలకొంది. పండగ సమీపిస్తుండటంతో అమ్మకాలు, కొనుగోళ్లతో కళకళలాడుతున్నాయి. గిరిజనులు వ్యవసాయ ఉత్పత్తులను వారపు సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తున్నారు. వచ్చే ఆదాయంతో పండగ సామగ్రి కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు. గురువారం పాడేరు మండలం గుత్తులపుట్టు సంతబయలులో జరిగిన వారపు సంతకు పాడేరు, జి.మాడుగుల, పెదబయలు, హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాలకు చెందిన గిరిజనులు భారీగా తరలిరావడంతో కిక్కిరిసి పోయింది.

- గుత్తులపుట్టు సంతలో కాఫీ,రాజ్మా, పిప్పలమోడి ఉత్పత్తుల అమ్మకాలు భారీగా జరిగాయి. ప్రైవేట్ వ్యాపారులు పోటీపడి కొనుగోలు చేశారు. సుమారు రూ.60 లక్షల మేర వ్యాపారం జరిగి ఉండవచ్చని వ్యాపారులు అంచనా వేస్తున్నారు.
- మేకలు, గొర్రెలు, నాటుకోళ్లకు రికార్డుస్థాయి ధరలు పలికాయి. సుమారు పది కిలోల మాంసం దిగుబడి వచ్చే మేకలు, గొర్రెలను రూ.12 నుంచి రూ.15 వేలకు కొనుగోలు చేశారు. సాధారణ రోజుల్లో వీటి ధర రూ.8 వేలకు మించి ఉండదు. సుమారు రూ.20 లక్షల మేర వ్యాపారం జరిగిందని మాంసం వ్యాపారులు అంచనా వేస్తున్నారు. నాటుకోళ్లకు మంచి ధరలు పలికాయి. కిలో బరువు ఉన్న నాటు కోడిని రూ. వెయ్యి నుంచి రూ.1300 ధరకు కొనుగోలు చేశారు. పెద్ద సైజు కోళ్లు ఒకొక్కదానికి రూ.4వేల వరకు ధర పలికింది.
- గుత్తులపుట్టు సంతలో అన్ని దుకాణాల వద్ద భారీగానే వ్యాపారం జరిగింది. కూరగాయలు, ఇతర నిత్యావసరాలతో పాటు కిరాణ సామగ్రిని గిరిజనులు కొనుగోలు చేశారు. సంతలో సుమారు వంద వరకు వస్త్ర దుకాణాలను వ్యాపారులు ఏర్పాటు చేశారు. వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాలతో వచ్చిన ఆదాయంతో గిరిజనులు కొత్త దుస్తులు, పండగ సామగ్రి కొనుగోలు చేసి తీసుకువెళ్లారు.
- గాజులు, ఫ్యాన్సీ, చెప్పుల దుకాణాల్లోను వ్యాపారం భారీగానే జరిగింది. దుస్తులు, కిరాణా కలుపుకుని సుమారు రూ.50 లక్షల వరకు వ్యాపారం జరిగింది. గిరిజనులు సంక్రాంతి పండగకు కొత్త కుండలను కొనుక్కుని ఇళ్లకు తీసుకువెళ్లారు.
- వాయిద్యాలకు ఉపయోగించే తుడుములను కొంతలి గిరిజనులు విక్రయించారు. గతేడాది తుడుము ధర రూ.3 వేలు ఉండగా, ఈ ఏడాది రూ.3,500కు పెరిగిందని గిరిజనులు తెలిపారు.



రూ.4 వేల ధర పలికిన జత నాటుకోళ్లు

ధరలు బాగా పెరిగాయి



గత సంక్రాంతి పండగతో పోల్చుకుంటే నిత్యావసరాలతో పాటు కొత్త దుస్తుల ధరలు బాగా పెరిగాయి. వంట నూనె కిలో బాటిల్ గత సారి రూ.105కు కొన్నా. ఇప్పుడు అదే బాటిల్ రూ.160కు పెరిగింది. దుస్తులు, ఇతర సామగ్రి కొనుగోలుకు రూ.17వేలు ఖర్చయింది.
- కిల్లో కమల, గృహిణి, మఠం కొత్తూరు, హుకుంపేట మండలం

ఆదుకున్న కాఫీ, పిప్పలమోడి



ఈఏడాది సంక్రాంతి పండగకు పిప్పలమోడి, కాఫీ అమ్మకాలు ఆదుకున్నాయి. పిప్పలమోడిని కిలో రూ.320 ధరకు 50 కిలోలు, కాఫీ గింజలు కిలో రూ.270ధరకు 40కిలోలు గుత్తులపుట్టు సంతలో అమ్మకాలు జరిపా.ఈ సొమ్మును సంక్రాంతి పండగ అవసరాలకు ఉపయోగిస్తున్నా.
- వంతాల రామన్న, గిరిజన రైతు, దిగుసోలములు, పాడేరు మండలం

సంతలోనే కొనుగోలు చేశాం



వారపుసంతల్లో గతంలో కన్నా నాణ్యమైన దుస్తులను వ్యాపారులు అమ్మకాలు జరుపుతున్నారు. పెద్ద పెద్ద దుకాణాలకు వెళ్లి ఆవే రకం దుస్తులను అధిక ధరలకు కొనుగోలు చేసి ఇబ్బందులు పడేకన్నా సంతలో బేరం ఆడి కొనుక్కోవడమే మేలు అనిపించడంతో సంతలోనే కొన్నా.
- బి.మధు, గుత్తులపుట్టు, పాడేరు మండలం

కన్నులపండువగా తెప్పోత్సవం



శ్రీరామగిరిలో పవిత్ర గోదావరిలో జరుగుతున్న తెప్పోత్సవ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న భక్తులు

- శ్రీరామగిరిలో ఘనంగా వేడుక
- గోదావరి తీరంలో భక్తుల పులకింత

వీఆర్‌పురం (చింతూరు): రెండో భద్రాద్రిగా పేరుగాంచిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీరామగిరిలో శ్రీ సుందర సీతారామచంద్ర స్వామి తెప్పోత్సవ వేడుక అత్యంత కోలాహలంగా గురువారం రాత్రి జరిగింది. వైకుంఠ ఏకాదశి సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకకు అశేషంగా భక్తులు తరలివచ్చి స్వామివారి వీక్షించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు సౌమిత్రి పురుషోత్తమాచార్యులు వైకుంఠ ఏకాదశి పర్వదిన విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం సాయంత్రం ఆలయం నుంచి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి పల్లకీపై ఆశీనులను చేసి వేద మంత్రాలతో ఊరేగింపుగా పవిత్ర గోదావరి, సంగమ ప్రాంతానికి తోడ్కొని వచ్చారు. అలంకరించిన హంస వాహనంలో సీతారాముల తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలీసులు, ఉత్సవకమిటీ, వివిధ శాఖల అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ పులి సంతోష్, తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో శోభూషణరావు, సీఐ కన్నపరాజు పాల్గొన్నారు.

పది ఫలితాల్లో జిల్లాకు ప్రథమ స్థానం లక్ష్యం

- డీఈవో గిడ్డి అప్పారావునాయుడు



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో అప్పారావునాయుడు

అనకాపల్లి: పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు సూచించారు. జీవీఎంసీ విలీన గ్రామమైన కొప్పాక డీఈవో కార్యాలయంలో గురువారం ఆయన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. వీరికి మెలకువలతో కూడిన బోధన చేయాలన్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తుంపాల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి నక్కా శ్రీనుబాబు, రాష్ట్ర ప్రతినిధులు పెనుమత్స కృష్ణంరాజు, కోట్ని రాంబాబు, లక్ష్మణ్, సాగర్, నూకేష్, ఎ.ఎం.ఓ.సత్యప్రసాద్ పాల్గొన్నారు.

డ్యూటీకి బయలుదేరి.. ఆగి ఉన్న లారీని ఢీకొట్టి

- శంకరం జాతీయ రహదారిపై వ్యక్తి దుర్మరణం



ఈశ్వరరావు మృతదేహం వద్ద విలపిస్తున్న భార్య (ఇన్‌సెట్) ఈశ్వరరావు (ఫైల్)

తుమ్మపాల: అనకాపల్లి టౌన్ పెట్రోలు బంకులో డ్యూటీకి స్కూటీపై వెళ్తుండగా ఆగి ఉన్న లారీని ఢీకొని గోగాడ ఈశ్వరరావు (44) దుర్మరణం చెందాడు. మండలంలో శంకరం జాతీయ రహదారిపై గురువారం ఉదయం 5.45 గంటల సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రూరల్ పోలీస్ స్టేషన్ అదనపు ఎస్సై నాగేశ్వరరావు వివరాల ప్రకారం.. చీడికాడ మండలం పెదగోగాడ అగ్రహారం గ్రామానికి చెందిన గోగాడ ఈశ్వరరావు తన కుటుంబంతో 15 ఏళ్ల క్రితం పొట్టకూటి కోసం వలసవచ్చి అనకాపల్లి మండలం రేబాక గ్రామంలో నివాసముంటున్నాడు. రోజు మాదిరిగానే డ్యూటీకి బయలుదేరిన అతడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్న వార్త తెలిసిన కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. పెట్రోలు బంకు యాజమాని డబ్బులు ఇస్తాడని, సాయంత్రం డ్యూటీ నుంచి వచ్చేటప్పుడు పండగ బట్టలు తెస్తానని చెప్పిన నాన్నను విగతజీవిగా చూసి పిల్లలు నిర్ఘాంతపోయారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లిదండ్రులు రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వర్కర్లుగా పనిచేస్తుండగా, భార్య లక్ష్మి, డిప్లొమా, బీటెక్ చదువుతున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుని కుమారుడు మోహన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యుఘోష

- ప్రత్యేక వలలు ఉపయోగిస్తేనే వాటి మనుగడ సాధ్యం

కోస్టల్ బ్యాటరీ వద్ద సముద్ర తీరంలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఒడ్డుకు వచ్చి చనిపోతున్నాయి. కొన్ని చనిపోయి ఒడ్డుకు కొట్టుకొస్తున్నాయి. స్థానికులు వీటికి పూజలు చేస్తున్నారు. ఇటీవల చనిపోతున్న తాబేళ్ల సంఖ్య పెరుగుతుండటం పట్ల పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు.



ఆలివ్ రిడ్లే తాబేలుకు నమస్కరిస్తున్న మహిళ

ఏయూక్యాంపస్: విశాఖ తీరంతో ఆలివ్ రిడ్లే తాబేళ్ల మృత్యుఘోష కొనసాగుతోంది. తాము పుట్టిన ప్రదేశానికి వచ్చి గుడ్లు పెట్టడం ఆలివ్ రిడ్లే తాబేళ్లకు అలవాటు. ఈ క్రమంలో తీరానికి వచ్చే సమయంలో బోట్లకు తగిలి, వలలో చిక్కుకుని తాబేళ్లు మృత్యువాత పడుతున్నాయి. నిత్యం విశాఖ సముద్ర తీరంలో ఏదో ఒక ప్రాంతంలో ఇవి దర్శనమిస్తున్నాయి. గురువారం కోస్టల్ బ్యాటరీ వద్ద సుమారు పదికి పైగా ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు దర్శనమిచ్చాయి. ఈ చిత్రాలు వాటి మనగడకు ఎదురవుతున్న ముప్పును ప్రస్ఫుటం చేస్తున్నాయి. అరుదైన, అంతరించే జాబితాలో ఉన్న ఆలివ్ రిడ్లేలను సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. వలలో పడే తాబేళ్లు సురక్షితంగా బయటికి వచ్చే విధంగా సీఐఎఫ్‌టీ ప్రత్యేకంగా ట్రెడ్‌ను అభివృద్ధి చేసింది. ఈ వలలతో సముద్రంలో మత్స్యకారులు వేట సాగిస్తే ఆలివ్ రిడ్లే తాబేళ్లు సులభంగా బయట పడతాయి. వలల్లో చిక్కుకుని, బోట్లకు గుద్దుకుని భారీ కాయం కలిగిన ఈ తాబేళ్లు మరణిస్తున్నాయి. ప్రతి సంవత్సరం పదుల సంఖ్యలో తాబేళ్లు మరణిస్తున్నాయి. గుడ్లు పొదిగి బయటికి వచ్చిన తాబేళ్లు అనేక సవాళ్లను ఎదుర్కొని సముద్రంలో తమ ఉనికిని చాటుతాయి. తిరిగి గుడ్లు పెట్టడానికి తాము పుట్టిన తీరానికి ఇవి వస్తాయి. రాత్రి వేళల్లో తీరంలో ఇవి గుడ్లు పెట్టి వెంటనే సముద్రంలోకి వెళ్లిపోతాయి. ఈ క్రమంలో ఇవి తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నాయి.

సభ పుణ్యం.. మొక్కలకు గండం!

విశాఖ విద్య : కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సభ పుణ్యమా అని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఇటీవల నాటిన మొక్కలు కనుమరుగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. సభ ఏర్పాట్లలో భాగంగా మొక్కల సంరక్షణ కోసం వేసిన ఫెన్సింగ్‌ను కూటమి నేతలు దగ్గరుండి తొలగించేశారు. 'అమ్మ పేరుతో ప్రతీ ఒక్కరూ ఓ మొక్క నాటాలని' ప్రధాని మంత్రి పిలుపులో భాగంగా ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో మొక్కలు పెంపకానికి వర్సిటీ అధికారులు సిద్ధమయ్యారు. దీనిలో భాగంగా గ్రౌండ్‌లో రోడ్డు వైపు మొక్కలు నాటారు. అటవీ శాఖతో పాటు, నగరంలోని పలు సంస్థలు మొక్కలు ఉచితంగా సరఫరా చేయగా, వీటిని నాటేందుకని వర్సిటీ బ్యూటిఫికేషన్ విభాగం ద్వారా రూ. 2.10 లక్షలు వెచ్చించారు. వీటి సంరక్షణకు ఫెన్సింగ్, నీటి సరఫరా, ట్యాంకుల కోసం సుమారుగా రూ.35 లక్షలకు పైగా నిధులు ఖర్చు చేశారు. గొప్ప ఆశయంతో మొక్కలు నాటామని వర్సిటీ అధికారులు చెబుతుండగా, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో బుధవారం నాటి ప్రధాని సభ కోసమని చేసిన ఏర్పాట్లతో రోడ్డు వైపున ఫెన్సింగ్ తొలగించారు. మొక్కలు నాటిన ప్రదేశంలోనే సభకు వినియోగించిన సామగ్రి పెట్టారు. పార్టీ జెండాలను సైతం మొక్కల్లోనే వదిలేసిపోయారు. సభలు, సమావేశాల పేరిట గ్రౌండ్‌ను ఇస్తున్న వర్సిటీ అధికారులు, మొక్కల సంరక్షణ విషయాన్ని మరిచిపోవటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సభ తరువాత ఇక్కడి దృశ్యాలను చూసిన విద్యార్థులు, అటుగా వెళ్తున్న నగర వాసులు సారూ... ఇదేం తీరు అంటూ ప్రశ్నిస్తున్నారు.



మొక్క చుట్టూ పడేసిన పార్టీ జెండాలు

గంజాయి రవాణా కేసులో వ్యక్తికి మూడేళ్ల జైలు

విశాఖ లీగల్: గంజాయి రవాణా చేస్తున్న ఓ వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ నగరంలోని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం. వెంకటరమణ గురువారం తీర్పు చెప్పారు. ఒక్కొక్కరు రూ.10 వేల జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని వెల్లడించారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ జి.ఎస్.ఎన్.వి.ప్రసాద్ రావు అందించిన వివరాలివీ.. నిందితుడు కుక్కల శీను ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్గానగర్‌లో నివాసం ఉంటున్నాడు. 2018 డిసెంబర్ 7న సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో శీను ఆరిలోవ సమీపంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ దగ్గర ఒక వాహనంలో గంజాయి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిని ఆరిలోవ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అప్పటి పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్ నిందితుడిని అరెస్ట్ చేసి, అతనిపై నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు ఇచ్చారు.

నేటి నుంచి సదరం తనిఖీలు

మహారాణిపేట: ఎన్టీఆర్ భరోసా దివ్యాంగుల పథకం కింద నెలకు రూ.15 వేలు పింఛన్లు తీసుకుంటున్న వారి ఇళ్లకు పలు శాఖల అధికారుల బృందం వెళ్లి తనిఖీలు నిర్వహించేందుకు శుక్రవారం శ్రీకారం చుడుతున్నారు. జిల్లాలో సదరం సర్టిఫికెట్ల ద్వారా నూరుశాతంతో 319 మంది ఈ పింఛను పొందుతున్న సంగతి తెలిసిందే. దీర్ఘకాలిక వ్యాధులు, రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచం పట్టిన క్షతగాత్రులు, మానసిక వ్యాధులతో మంచం పట్టిన బాధితులు కూడా ఇందులో ఉన్నారు. ఈ నేపథ్యంలో మూడు బృందాలు వెళ్లి విచారణ చేయనున్నాయి. డీఆర్‌డీఏ ఏపీడీలతో పాటు ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, ఇతర స్పెషలిస్టులతో కూడిన వైద్య బృందం, వీరితో పాటు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, ఏఎన్ఎం, ఆశ, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్ ఈ తనిఖీల్లో పాల్గొంటారు. 18, 20, 21, 24 తేదీల్లోను ఈ బృందాలు పర్యటిస్తాయి.

మైనార్టీలు, దళితులపై దాడులు పెరిగాయి

- సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకుడు జేవీ చలపతిరావు



సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

తాటిచెట్లపాలెం: ఎన్నడూ లేని విధంగా దేశంలో మైనార్టీలు, దళితులపై దాడులు పెరిగాయని, ఈ కారణంగా అన్ని వర్గాల వారు సమానత్వం కోసం ఉద్యమాలు చేస్తున్నారని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ నాయకులు జేవీ చలపతిరావు తెలిపారు. గురువారం ఉదయం రైల్వే న్యూకాలనీలో గల సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో మురికివాడల నివాసుల సంక్షేమ సంఘం, పీవోడబ్ల్యూ సంయక్తంగా ఏర్పాటుచేసిన విశాఖ నివాసుల పోరాట దినం సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణిపూర్, కాశ్మీర్ తదితర ప్రాంతాల్లో ఎన్నడూ లేని విధంగా దళితులు, మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడీ వర్గాలే వీటికి కారణమని తెలిపారు. 2012 నాటికి ఏ సమస్యలు ఉన్నాయో నేటికీ అవే సమస్యలు ఉన్నాయని, సమరశీల పోరాటాల వలన నేడు స్టీల్‌ప్లాంట్‌ను అమ్మలేకపోయారని తెలిపారు. ప్రజలకు సంబంధం లేకుండా పెట్టుబడి దారుల కోసం పాలకులు చేస్తున్న అభివృద్ధి విధ్వంసకరమైనదన్నారు. ఒకనాడు ఫ్యాక్టరీ వస్తే అది అందరి కోసం అనుకునే వారని, నేడు ఫ్యాక్టరీలు వస్తే ప్రజల వినాశనానికి అన్న విధంగా తయారైందన్నారు. మానవ హక్కులను హరించే ప్రధాని నరేంద్ర మోదీ నిత్యం బ్రహ్మణిజాన్ని పోషిస్తూ కుల వ్యవస్థని ప్రోత్సాహిస్తున్నారన్నారు. పర్యావరణానికి హాని కలిగించే ఫార్మసిటీని ప్రోత్సహిస్తూ చంద్రబాబు విధ్వంసకర అభివృద్ధిని ప్రోత్సహిస్తున్నారన్నారు.

కర్ణాటక హైకోర్టు న్యాయవాది, కార్మిక నాయకులు బాలన్ మాట్లాడుతూ సనాతన కార్పొరేట్ ఫాసిజం బీజేపీ పాలనలో పెరిగిపోతుందన్నారని పేర్కొన్నారు. బ్యాంకుల్లో నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి ఒక్కరి ఖాతాలో రూ. 15 లక్షలు వేస్తానని, రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని హామీలిచ్చి నేడు ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు మోదీ కట్టబెడుతున్నారని తెలిపారు. ఫలితంగా అదానీ, అంబానీల ఆస్తులు లక్షల కోట్లు పెరిగాయన్నారు. సదస్సులో పాల్గొన్న రైటర్స్ అకాడమీ చైర్మన్ రమణమూర్తి మాట్లాడుతూ పేదలను మరింత పేదలుగా చేయడమే పాలకుల లక్ష్యం అని తెలిపారు. ఆనాడు విశాఖలో నివాస హక్కుల ఉద్యమంలో 90 మందిని అరెస్టు చేసి, రెండు వందల మందిపై కేసులు పెట్టిన మున్సిపల్ కమిషనర్ రామాంజనేయులు నేడు ఎమ్మెల్యే అయ్యారని తెలిపారు. సదస్సు అనంతరం రైల్వే న్యూకాలనీ నుండి ర్యాలీగా వెళ్లి జీవీఎంసీ కమీషనర్‌కు వినతిపత్రం సమర్పించారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అనకాపల్లి: విద్యుత్ శాఖ డి–1 సెక్షన్ పరిధిలో తీగల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు, జంగిల్ క్లియరింగ్ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఆ శాఖ ఈఈ కె.రాజశేఖర్, డి–1 సెక్షన్ ఏఈ త్రినాథ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ టౌన్–11 ఫీడర్ పరిధిలో పూడిమడక రహదారి, శారదా కాలనీ, నెహ్రూచౌక్, న్యూకాలనీ, వేల్పులవీధి బాలికోన్నత పాఠశాల, రాజా థియేటర్ రహదారి, తహసీల్దార్ కార్యాలయం రహదారి, పాత బర్మా కాలనీ, జీవీఎంసీ కార్యాలయం రహదారి ప్రాంతాల్లో సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

17న మండల సర్వసభ్య సమావేశం

అనకాపల్లి: ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 15వ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.వి.నరసింహరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో 26 ప్రభుత్వ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారన్నారు. గ్రామాల్లో సమస్యలను చర్చించి, పరిష్కార మార్గానికి చర్యలు చేపడతామన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలపై నిరసన


అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కశింకోట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక హౌసింగ్ కాలనీలో నిరసన తెలిపారు. ముందుగా పాదయాత్ర చేసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి కత్తెర శ్రీధర్, అసెంబ్లీ కోఆర్డినేటర్ మల్లపురెడ్డి కోటేశ్వరరావు, జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడు సూరా శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ కాళ్ల సత్యనారాయణ, పీసీసీ సభ్యుడు తుట్ట రమణ, నాయకులు బోయిన భానుమూర్తి, సేనాపతి రాజు, దొమ్మేటి రమణారావు, వేగి కన్న అప్పారావు, బి. బాలమురళీ పాల్గొన్నారు.

నాలుగు ట్రాక్టర్లు, జేసీబీ సీజ్


గోపాలపురంలో గ్రావెల్ టాక్టర్‌ను పట్టుకున్న తహసీల్దార్ విజయకుమార్

అనకాపల్లి: మండలంలో అక్రమంగా గ్రావెల్స్ తరలింపు రోజురోజుకు పెరిగిపోతోంది. ఇటీవల కలెక్టర్ విజయకృష్ణన్ తమ బంగ్లాకు వెళ్లే సమయంలో కోడూరు గ్రామం నుంచి వెళ్తున్న గ్రావెల్స్ ట్రాక్టర్లను గుర్తించి తహసీల్దార్ కె.విజయకుమార్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన మైనింగ్ ఆర్‌ఐ శ్రీనివాసరావు కొడూరు, గోపాలపురం, మారేడుపూడి, కొత్త తలారివానిపాలెం, గొలగాం గ్రామాల్లో గ్రావెల్స్ తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని రూరల్ పోలీసులకు అప్పగించారు.

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 14 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్–1 యూనిట్, బీ పాజిటివ్–4 యూనిట్లు, ఓ పాజిటివ్–7 యూనిట్లు, ఏబీ పాజిటివ్–2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 396 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 341 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924–223595 నంబరును సంప్రదించవచ్చు.

జగనన్న కాలనీలపై కూటమి వివక్ష


మారేడుపూడి గ్రామంలో జగనన్న కాలనీ గృహాలు

70 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తి

మౌలిక సదుపాయాల కల్పనలో నిర్లక్ష్యం

పాలకులకు మొరపెట్టుకున్నా చర్యలు శూన్యం

డ్రైనేజీలు, సీసీ రోడ్లు లేక అవస్థలు


సుందరయ్యపేట గ్రామంలో డ్రైనేజీలు, సీసీరోడ్లు వేయాలని ధర్నా చేస్తున్న కాలనీ వాసులు


మారేడుపూడి గ్రామంలో జగనన్న కాలనీలో రాహదారిపై మురుగునీరు

అనకాపల్లి: రెక్కాడితే గాని డొక్కాడని ఎంతోమంది నిరుపేదలకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంతింటి కల సాకారం చేసిన పాపానికి కూటమి ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోంది. జగనన్న కాలనీల్లో స్థలాలు ఇవ్వడంతో ఇళ్లు కట్టుకుని ఎంతో ఆనందంతో గృహ ప్రవేశం చేసి నివసిస్తున్న వారికి కనీస మౌలిక సదుపాయాలు కల్పించకుండా వివక్ష చూపుతోంది. గత వైఎస్సార్ సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు సొంతింటి కల నెరవేర్చడం కోసం జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో అర్హులైన లబ్ధిదారులను వలంటీర్ల ద్వారా గుర్తించి ప్రభుత్వం స్థలమిచ్చి గృహ నిర్మాణాలకు కావాల్సిన సామగ్రి సరఫరా చేసింది. ఈ మేరకు గృహాలు పూర్తి కావడంతో 70 శాతం మంది లబ్ధిదారులు నివాసముంటున్నారు.

పట్టణ, మండల పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు మండలంలో మారేడుపూడి, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, రేబాక, శంకరం, గొలగాం, బట్లపూడి, కోడూరు 1, 2, పాపయ్యపాలెం, పాపయ్య సంతపాలెం, మామిడిపాలెం, తుమ్మపాల, బవులవాడ, కుంచంగి, కూండ్రం, సుందర్యపేట, సీతానగరం, కొండుపాలెం, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో సుమారుగా 7 వేల మంది లబ్ధిదారులకు గత పాలనలో స్థలం కేటాయించి, గృహాలు నిర్మించారు. అప్పట్లో గృహాలు నిర్మిస్తున్న సమయంలో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేశారు.

పాలన మారగానే తిప్పలు...

మండలంలో మారేడుపూడి, గోపాలపురం, అక్కిరెడ్డిపాలెం, మామిడిపాలెం, శంకరం, సుందరయ్యపేట, జగన్నాథపురం, కొత్తూరు తదితర గ్రామాల్లో 70 శాతం లబ్ధిదారులు జగనన్న కాలనీల్లో నివసిస్తున్నారు. కాలనీలకు గత ప్రభుత్వంలో ముందుగా విద్యుత్ స్తంభాలు, తాగునీటి కుళాయిలను ఏర్పాటు చేశారు. మిగిలిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడుతున్న సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, కూటమి అధికారం చేపట్టడంతో కాలనీ వాసులకు తిప్పలు తప్పడం లేదు.


సుందరయ్యపేట గ్రామంలో జగనన్న కాలనీలో రహదారి పరిస్థితి

డ్రైనేజీ లేక తీవ్ర ఇబ్బందులు...

కొత్తగా డ్రైనేజీ వ్యవస్థ, రహదారులు నిర్మించాలని ఆయా ప్రాంతాల ప్రజలు విన్నవించుకున్నప్పటికీ కూటమి నేతలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో గృహాల్లో వాడుకనీరు రహదారిపైకి వచ్చి అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా దోమల సమస్యలో మరింత ఇబ్బందిగా ఉందని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు, వృద్ధులు వ్యాధుల బారిన పడుతున్నారు.

పట్టించుకోని అధికారులు

కూటమి ప్రభుత్వంలో జగనన్న కాలనీలను అధికారులు పట్టించుకోకపోవడం వల్ల ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులు భయపడుతున్నారు. రెండు నెలల క్రితం కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీలు ఇచ్చినప్పటికీ అధికారులలో స్పందన లేకుండా పోయింది.

రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి



మారేడుపూడి రెవెన్యూ పరిధిలో కొండ వద్ద జగనన్న కాలనీలో 160 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చారు. 70 శాతం గృహాలు పూర్తయ్యాయి. రెండు మాసాల్లో 20 శాతం గృహాలు పూర్తవుతాయి. జగనన్న కాలనీల్లో నివసిస్తున్నప్పటికీ డ్రైనేజీ, సీసీరోడ్లు లేకపోవడంతో ఇబ్బందిగా ఉంది. రాత్రి సమయంలో రహదారిపైకి రావాలంటే భయంభయంగా ఉంది. కూటమి ప్రభుత్వంలో సీసీరోడ్లు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలని రెండు మాసాల క్రితం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం. ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. – కె.సత్తిబాబు, మారేడుపూడి గ్రామం, అనకాపల్లి మండలం

సీపీఎం ఆధ్వర్యంలో నిరసన


తాళ్లపాలెంలో నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

కశింకోట: ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖ వచ్చిన సందర్భంగా అక్రమ గృహ నిర్బంధం, అరెస్టులను వ్యతిరేకిస్తూ గురువారం తాళ్లపాలెంలో సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు నిరసన తెలిపారు. జిల్లా వ్యాప్త కార్యక్రమంలో భాగంగా సీపీఎం నాయకులు ఇక్కడ ఆందోళన చేపట్టారు. విశాఖ స్టీల్ ప్లాంట్ గురించి ఒక్క మాట మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. సీపీఎం నాయకుడు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా నాయకురాలు డి.డి. వరలక్ష్మి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

శ్రీకృష్ణావతారంలో వేంకటేశ్వరస్వామి


శ్రీకృష్ణునిగా దర్శనమిస్తున్న వేంకటేశ్వరస్వామి

కశింకోట: స్థానిక గవరపేటలో వెలసిన వేంకటేశ్వర స్వామి శ్రీకృష్ణునిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా విష్ణుమూర్తి దశావతారాల్లో భాగంగా శ్రీకృష్ణునిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు చింతా సుబ్రహ్మణ్యం, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త భీశెట్టి దుర్గానాగేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

మహిళా అభివృద్ధితో ఉన్నత స్థితికి కుటుంబం


తాళ్లపాలెంలో కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు పొందిన మహిళలు


మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కశిరెడ్డి అప్పలనాయుడు

అనకాపల్లి: మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లయితే ఆ కుటుంబం ఉన్నత స్థితికి చేరుతుందని భగవాన్ సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు కశిరెడ్డి అప్పలనాయుడు తెలిపారు. సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగరంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆయన పాల్గొని మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంటు ప్రోగ్రాంలో భాగంగా పేద మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు అందజేస్తున్నామన్నారు. ఈ శిక్షణ 30 రోజులు ఉంటుందన్నారు. గృహాల్లో మహిళలు బట్టలు కుట్టుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ఇది ఎంతగానో ఉపయోపడుతుందని చెప్పారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రతినిధి అన్నం రాజశేఖర్, గాంధీనగరం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ అప్పారావు, సంస్థ ఫౌండర్ లక్ష్మణరావు, రమేష్, కుట్టుమిషన్ శిక్షకురాలు సుభాషిణి పాల్గొన్నారు.

కశింకోట: కుట్టు శిక్షణలో పొందిన మెలకువలను పాటించి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకుని తమ కుటుంబాలకు సహాయంగా నిలవడానికి కృషి చేయాలని జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు కసిరెడ్డి అప్పలనాయుడు కోరారు. తాళ్లపాలెంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా టైలరింగ్ అండ్ ఫ్యాషన్ డిజైనింగ్‌లో 26 మంది మహిళలకు ఇచ్చిన శిక్షణ గురువారంతో పూర్తయింది. ఈ సందర్భంగా వారికి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి అన్నం రాజశేఖర్, శిక్షకురాలు శ్రీదేవి, డాక్టర్ వెంకటరావు పాల్గొన్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి

అనకాపల్లి: జీవీఎంసీ విలీన గ్రామమైన కె.ఎన్.ఆర్.పేటలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించడం జరుగుతుందని గ్రామ సీతారామ దేవాలయం భక్త బృందం కమిటీ ప్రతినిధి చూచుకొండ రమణ తెలిపారు. గ్రామంలో పలు దుకాణాల్లో బృందం సభ్యులు పర్యటించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగ్ యూజ్ ప్లాస్టిక్‌ను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం పెరిగిపోవడంతో క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

జమిలి ఎన్నికలపై స్మారకోపన్యాసం నేడు

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారి దొడ్డి రాముునాయుడు భవనంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు కామ్రేడ్ ఎ.బాలకృష్ణ ప్రథమ వర్ధంతి పురస్కరించుకుని ''రాజ్యాంగ పరిరక్షణ–జమిలి ఎన్నికలు'' అనే అంశంపై స్మారకోపన్యాసం ఉంటుందని సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ గురువారం ఒక ప్రకటలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.శర్మ విచ్చేస్తారన్నారు.

ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులపై దృష్టి సారించాలి


ఉపాధ్యాయుల అందజేసిన పుస్తకాలతో విద్యార్థులు


ప్రతిభ చూపిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేత

కశింకోట: ప్రాథమిక స్థాయిలోనే విద్యార్థులపై దృష్టి సారిస్తే ఉన్నత స్థాయికి చేరుకుంటారని కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం, స్కూల్ కాంప్లెక్స్ అధ్యక్షుడు ఎం.ఆర్.వి అప్పారావు అన్నారు. గురువారం వెదురుపర్తి హైస్కూలులో 3, 4, 5 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు తమ ఇళ్ల వద్ద విద్యార్థులతో హోం వర్క్ చేయించడంపై శ్రద్ధ వహించాలన్నారు. హెచ్‌ఎం ఎ.వి.ఎస్. మూర్తి మాట్లాడుతూ 'పునాది అక్షరాస్యత, సంఖ్యా శాస్త్రం 'ను సులభతరం చేయడానికిగాను ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్ల భాషల్లో చదవడం, రాయడంతో పాటు గణితంలో చతుర్విధ ప్రక్రియాలు సులువుగా నేర్పడం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు సమకూర్చిన పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. సంగ్రహనాత్మక మూల్యాంకణంలో 3 నుంచి 10వ తరగతి వరకు ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు జ్ఞాపికలు అందజేశారు. ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, సబిత లక్ష్మి, సోమరాజు, సత్యవేణి, త్రివేణి, ఎ. నూకరాజు, విజయ్, పి. సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని క్లాప్ వాహన లోడర్స్ ధర్నా


జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న క్లాప్ వాహన లోడర్స్

అనకాపల్లి: జోన్ పరిధిలోని క్లాప్ వాహనాల్లో పనిచేస్తున్న లోడర్స్ బకాయి జీతాలను చెల్లించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో గురువారం స్థానిక జోనల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ జీవీఎంసీ అధికారులు, కాంట్రాక్టరుకు విన్నవించినా స్పందించకపోవడంతో తప్పని పరిస్థితిల్లో ధర్నా చేశామన్నారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రకరకాల పేర్లతో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పేర్లతో కార్మికులకు అన్యాయం చేస్తుందన్నారు. సుప్రీం తీర్పు ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లోడర్స్‌కు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎర్రంశెట్టి శివకుమార్, వై.ఏసురాజు, ఓంశివ, పాట్నూరి గోవిందు, సీఐటీయూ నాయకులు వి.వి.శ్రీవివాసరావు, శివ కుమార్, ప్రసాదు, భారతి పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు


సంక్రాంతి వేషధారణలతో అలరించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు


కశింకోట డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో ముగ్గులు వేస్తున్న బాలికలు


సంక్రాంతి వేడుకల్లో చిన్నారులు


గాలిపటాలు ఎగుర వేస్తున్న బాలురు

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు శుక్రవారం నుంచి సంక్రాంతి సెలవులు కావడంతో ముందుగా సంక్రాంతి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సంక్రాంతి వేషధారణలతో ఆకట్టుకున్నారు. బాలికలకు రంగవల్లుల పోటీలు, బాలురకు గాలిపటాల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. చివరిగా భోగి మంట వేసి విద్యార్థులు ఆనందోత్సాహాలు పంచుకున్నారు. హెచ్‌ఎం ఎం.ఆర్.వి అప్పారావు, ఉపాధ్యాయులు బి. అప్పారావు, బి. ఆనంద్, నీలవేణి, శేషుకుమారి, స్కూలు నిర్వహణ కమిటీ అధ్యక్షురాలు నక్కా నాగమణి, ఆచంట రవి, ఎస్.జె.వి. ప్రసాద్, పీడీ వి. ప్రభాకరరావు పాల్గొన్నారు.

అనకాపల్లి: స్థానిక ఉడ్‌పేట హ్యాపీ కిడ్స్ ప్లే స్కూల్‌లో చిట్టిపొట్టి చిన్నారులంతా ముందస్తు సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా నిర్వహించారు. హరిదాసు, గంగిరెద్దు, కొమ్మదాసు, రైతులు తదితర ప్రత్యేక వేషధారణలతో చిట్టిపొట్టి చిన్నారులంతా చూడముచ్చటగా సందడి చేశారు. రంగురంగుల ముగ్గుల నడుమ ఏర్పాటు చేసిన భోగి మంట చుట్టూ గొబ్బిళ్లమ్మో గొబ్బిళ్లు అని తిరుగుతూ ఆనందం పరవశులయ్యారు. సంక్రాంతి విశిష్టమైనదని ప్రత్యేకించి తెలుగు వారికి బంధుమిత్రులతో జరుపుకునే పెద్ద పండగని స్కూల్ కరస్పాండెంట్ శెట్టి గిరీష్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘తిరుపతి మృతులకు రూ.కోటి పరిహారం చెల్లించాలి’


డీఆర్వోకు వినతి అందిస్తున్న హరినాథ్‌బాబు

అనకాపల్లి: తిరుపతి వేంకటేశ్వర స్వామి వైకుంఠ ఏకాదశి దర్శనం కోసం ఏర్పాటు చేసిన టిక్కెట్ల కౌంటర్ వద్ద తొక్కిసలాటలో మృతి చెందిన భక్తుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. టీటీడీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరుగురు మృత్యువాత పడగా, పలువురు గాయపడటం బాధాకరమన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

టీటీడీ పాలకవర్గాన్ని రద్దు చేయాలి

తుమ్మపాల: తిరుపతిలో తొక్కిసలాటకు బాధ్యులుగా టీటీడీ పాలకవర్గాన్ని రద్దు చేసి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తితో విచారణ చేపట్టాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ కొణతాల హరినాథ్ బాబు గురువారం కలెక్టరేట్‌లో డీఆర్వో వై.సత్యనారాయణరావుకు వినతిపత్రం అందించారు. నూతన పాలకవర్గంలో రాష్ట్రపతి అవార్డులు పొందిన సేవాతత్పరులను మాత్రమే నియమించాలన్నారు.

ముక్కోటికి సర్వం సిద్ధం


గాంధీనగరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పుష్పాలతో అలంకరణ


రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయ సమీపంలో అనంత పద్మనాభ వేంకటేశ్వరుడు


దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయం

అనకాపల్లి/కశింకోట: వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు వైభవోపేతంగా నిర్వహించడానికి సన్నాహాలు చేశారు. ధనుర్మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఒక్కొక్క ఆలయంలో ఒక్కొక్క ప్రత్యేకతతో ఉత్సవాలు జరపడానికి, ఉత్తర ద్వార దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు చేశారు. అనకాపల్లి పట్టణంలో దేమునిగుమ్మం, సుంకరమెట్ట జంక్షన్, గాంధీనగరం వేంకటేశ్వరస్వామి, రాజుపాలెం సూర్యనారాయణ దేవాలయాలతో పాటు కశింకోట దేవాదాయ శాఖకు చెందిన పురాతన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, జాతీయ రహదారి పక్కన వెలసిన కోదండ సీతారామచంద్రమూర్తి స్వామి, గవరపేటలోని శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి, ధ్యాన వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో వేకువ జామున 3 గంటలకు సుప్రభాత సేవ, స్వామి అలంకరణ, విష్ణు సహస్ర నామార్చన, తిరుప్పావై పఠనం, అనంతరం వైకుంఠ ద్వార దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు చేశారు. స్వామి వారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించడానికి ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాలతో ఆయా ప్రాంతాలు ఆధ్యాత్మిక శోభతో అలరారనున్నాయి.

పోలీస్ బందోబస్తు...

పట్టణంలో దేవాలయాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, రూరల్ సీఐ రవికుమార్ ప్రత్యేక పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులు బంగారు ఆభరణాలు వేసుకుంటే అజాగ్రత్తగా ఉండొద్దన్నారు. ఎక్కడైన అనుమానిత వ్యక్తులు సంచరించినట్లయితే దగ్గరలో పోలీసు సిబ్బందికి తెలియజేయాలని కోరారు.

కూరగాయల ధరలు స్థిరంగా

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం కూరగాయల ధరలు స్థిరంగా ఉన్నాయి. టమాటా కిలో రూ.20, ఉల్లి, బంగాళదుంప, పచ్చి బఠాణీ కాయలు, క్యాబేజీ రూ.40, పచ్చిమిర్చి రూ.50, వంకాయ, దొండకాయ రూ.60, క్యారెట్, బీట్‌రూట్, బెండకాయ, బీన్స్ రూ.70, క్యాప్సికం రూ.80కి విక్రయాలు సాగాయి.